క్లుప్తంగా

భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలి



మెట్ల మార్గాన్ని పరిశీలిస్తున్న ఆలయ ఈఓ

యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారి ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ఆలయ ఈవో గుగులోతు రవి నాయక్ అన్నారు. బుధవారం ఆయన యాదగిరి కొండ పైన కియోస్క్ మిషన్లు, ప్రసాద విక్రయ కేంద్రం, మెట్ల మార్గం, జల ప్రసాద ప్రాంతాలను పరిశీలించారు. వైకుంఠ ద్వారం నుంచి కొండపైకి వెళ్లే మెట్ల మార్గంలో విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయాలని ఎలక్ట్రిషన్ విభాగం అధికారులను సూచించారు కొండపైన భక్తులకు తాగునీటి కొరత లేకుండా చూడాలన్నారు. నాణ్యత ప్రమాణాలతో కూడిన స్వచ్ఛమైన తాగునీటిని జల ప్రసాదాల వద్ద అందుబాటులో ఉంచాలన్నారు. ప్రసాద టికెటింగ్‌కు ఏర్పాటు చేసిన కియోస్క్ మిషన్‌లను పూర్తి స్థాయిలో పని చేసేలా టెక్నిషియన్లతో బాగు చేయించాలన్నారు. ఆయన వెంట ఆలయాధికారులు రామారావు, దూశెట్టి కృష్ణ, నవీన్‌కుమార్, రఘు తదితరులు ఉన్నారు.

రిటైర్డ్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

రాజాపేట : రిటైర్డ్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని రిటైర్డ్ ఉపాధ్యాయ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు నర్సింహ రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని రామకృష్ణ సాయి మందిర్‌లో మండల ఆ సంఘం కార్యవర్గ సమావేశాన్ని చింతకింది మల్లయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో పరిగి రాములు, వంచ ఉపేందర్‌రెడ్డి, బల్ల దామోదర్, సోమరాజు, బూర్గు మహేందర్‌రెడ్డి, పటేల్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

కెరీర్ గైడెన్స్‌పై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సంస్థ ప్రతినిధులు

భూదాన్‌పోచంపల్లి : పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం హార్ట్ ఫుల్ నెస్ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు కెరీర్ గైడెన్స్, క్రమశిక్షణ, ధ్యానం, లక్ష్యసాధనపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధి సోమేశ్వరీ, ప్రిన్సిపల్ బి. సురేశ్‌రెడ్డి, స్టూడెంట్ కౌన్సిలర్ సంతోష్‌కుమార్, అధ్యాపకులు తులసి, రాజేశ్వరమ్మ, జ్యోతి, సాయివర్ధన్, శివశంకర్, వెంకట్‌రెడ్డి, వెంకటేశం, స్వాతి, రుణుకాదేవి, చందన, శ్రీదేవి, కిషోర్‌కుమార్ పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి



హ్యాండ్ వాష్‌పై అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ సూపర్‌వైజర్ జ్యోతి

మోటకొండూర్: ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ జ్యోతి అన్నారు. బుధవారం మండలంలోని అమ్మనబోలు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ్ మసోత్సవంలో భాగంగా హ్యాండ్ వాష్ డే నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్‌లు బి సిద్దమ్మ, ఎమ్ భాగ్య లక్ష్మీ, ఎల్ వసంత తదితరులు పాల్గొన్నారు.

ఆలయ వార్షికోత్సవం

బీబీనగర్: మండలంలోని కొండమడుగు గ్రామంలో గల శ్రీకారుకమ్మ వనదేవత ఆలయ వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు శివరామిరెడ్డి, నాయకులు శ్రీనివాస్‌గౌడ్, స్వామిగౌడ్, భూషపాక మల్లేశం, రాజమల్లెశం, భాస్కర్‌గౌడ్, విజయభాస్కర్‌రెడ్డి, పాండు పాల్గొన్నారు.

మంత్రి పొన్నం ప్రభాకర్ దిష్టిబొమ్మ దహనం

చౌటుప్పల్ : మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌పై రాష్ట్ర రవాణ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో బుధవారం ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బోయ లింగస్వామి, తూర్పింటి యాదయ్య, శంకర్, లింగస్వామి, శ్రీనివాస్, గౌతమ్, అర్జున్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

ఆత్మకూరు(ఎం): మండలంలోని పుల్లాయిగూడెంలో రాచమల్ల మల్లయ్య అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. కేహెచ్‌ఆర్ ఫౌండేషన్ అధినేత కొప్పుల హరిదీప్‌రెడ్డి సహకారంతో బీఆర్‌ఎస్ గ్రామ శాఖ ఆధ్వర్యంలో రూ. 5వేలను మృతుడి కుటుంబానికి అందచేశారు. అదేవిధంగా మృతుడి కుటుంబ సభ్యులకు బీఆర్‌ఎస్ నాయకుడు బత్తిని ప్రవీణ్ రూ. 5వేల ఆర్థికసాయం అందజేశారు.

పత్తి రైతు పరేషాన్

- వరుస వర్షాలతో పత్తి పంటకు భారీ నష్టం
- పంటను ఆశించిన చీడ పీడలు
- గణనీయంగా తగ్గనున్న దిగుబడులు
- పెట్టుబడి వచ్చే పరిస్థితి లేదని ఆందోళన చెందుతున్న రైతులు



అడ్డగూడూరులో తెగులు సోకిన పత్తిపంట

అడ్డగూడూరు : పత్తి సాగు చేసే రైతులకు ప్రతి ఏడాది నిరాశ ఎదురవుతోంది. అతివృష్టి, అనావృష్టి కారణాలతో రైతాంగం ఆర్థికంగా నష్టపోతున్నది. ఎప్పటిలాగే ఈ ఏడాది కూడా గంపెడాశలు పెట్టుకొని పత్తి సాగు చేపట్టిన రైతులకు విత్తనాలు నాటే దశనుంచే కష్టాలు మొదలయ్యాయి. సీజన్ మొదట్లో వానదేవుడు ముఖం చాటేయడంతో విత్తిన విత్తనాలు భూమిలోనే కలిసిపోయాయి. ఆ తరువాత ఎడతెరిపి లేని వర్షాల కారణంగా ఎర్రగుమ్మడి తెగులు సోకి పత్తి పంటకు భారీ నష్టం కలిగింది. చెట్టుకు 50 నుంచి 60 కాయలు ఉండాల్సిన చోట ఐదు నుంచి 15 కాయలు కూడా కాయలేవు. దీంతో పంట దిగుబడి గణనీయంగా తగ్గనుండడంతో పెట్టిన పెట్టుబడి వచ్చే పరిస్థితి లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు.

11,650 ఎకరాల్లో పత్తి సాగు

అడ్డగూడూరు మండల వ్యాప్తంగా ఈ ఏడాది సుమారు 11, 650 ఎకరాల్లో పత్తి సాగు చేశారు. జూన్ నెలలో సరిపడా వర్షాలు కురవకపోవడంతో జులైల్లో పత్తి విత్తనాలు విత్తుకున్నారు. మొలకలున్నప్పుడే నెల రోజులపాటు వర్షాలు దంచి కొట్టాయి. దీంతో మొలక ఎదుగుదల నిలిచిపోయింది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు పంట చేతికందేలా లేవని రైతులు ఆందోళన చెందుతున్నారు.

పెరిగిన పెట్టుబడి

గత ఏడాదితో పోల్చుకుంటే పత్తిపంటకు పెట్టుబడి ఈ ఏడాది గణనీయంగా పెరిగింది. పురుగు మందులు, ఎరువుల ధరలతో పాటు కూలీల ఖర్చులు కూడా పెరిగాయి. వ్యవసాయ పనులు అన్ని ఒకే సమయంలో రావడంతో కూలీల డిమాండ్ కూడా అధికమైంది. దీని కారణంగా పత్తి రైతులు అధికంగా వెచ్చించాల్సి వచ్చినా అంశించిన దిగుబడులు వచ్చే పరిస్థతి లేదు. దీనికి తోడు పగిలిన పత్తిని తీయాలంటే కూలీల కొరత తీవ్రంగా ఉంది. తీసిన పత్తిని విక్రయించాలన్న సీసీఐ కేంద్రాలు ఏర్పాటు చేయలేదు. రైతులు క్వింటా పత్తిని రూ.5,500 నుంచి రూ.6వేలకు దళారులకు అమ్ముకోవాల్సిన పరిస్థితి నెలకొంది. పెట్టిన పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదని పత్తి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పెట్టుబడి వచ్చేలా లేదు



జూన్ చివరి వారంలో పది ఎకరాల్లో పత్తి పంట సాగు చేశాను. వర్షాలకు పంట తెగుళ్ల భారిన పడి చేను ఎదగలేదు. పత్తి సాగుకు రూ. 3 లక్షలు పెట్టుబడి పెట్టాను. చెట్టుకు 10 కాయలు కూడా కాయలేదు. ఎకరాకు 3 క్వింటాల పత్తి కూడా వచ్చే పరిస్థితి లేదు. పెట్టిన పెట్టుబడి వచ్చేలా లేదు.

– దాసరి సత్తయ్య రైతు, అడ్డగూడూరు

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు ఆందోళన చెందొద్దు

- కలెక్టర్ హనుమంత రావు



బొమ్మలరామారం : నాగినేనిపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల వివరాలను తెలుసుకుంటున్న కలెక్టర్

బీబీనగర్, బొమ్మలరామారం: ఇందిరమ్మ ఇళ్ల బిల్లులు సకాలంలో ఖాతాల్లోకి చేరతాయని లబ్ధిదారులు ఆందోళన చెందొద్దని కలెక్టర్ హనుమంతురావు అన్నారు. బీబీనగర్ మండలం కొండమడుగు, బొమ్మలరామారం నాగినేనిపల్లి గ్రామాల్లో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను బుధవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. ఇళ్ల నిర్మాణ పనులు ఆపకుండా త్వరితగతిన పూర్తి చేసుకోవాలన్నారు. దశల వారీగా బిల్లులు వస్తాయన్నారు. నిర్మాణ పనులకు సబంధించి ఫొటో క్యాప్చర్ చేసి ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేయాలని అధికారులకు సూచించారు. నాగినేనిపల్లిలో నిరుపేదలైన చిక్క సరోజన, గొట్టిముక్కల రాజమ్మలకు మంజూరైన ఇళ్లను సకాలంలో నిర్మాణాలను పూర్తిచేసుకునేందుకు చేయూతనిస్తున్న రామిడి జంగారెడ్డిని కలెక్టర్ అభినందించారు. ఆయన వెంట నాగినేనిపల్లి పంచాయితీ కార్యదర్శి నవీన్, పలువురు లబ్ధిదారులు, అధికారులు ఉన్నారు.

బస్సు సౌకర్యం కల్పించాలి



యాదగిరిగుట్ట డీఎంకు వినతి పత్రం అందజేస్తున్న విద్యార్థులు

రాజాపేట : మండలంలోని దూదివెంకటాపురం గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ పలువురు గ్రామస్తులు, విద్యార్థులు బుధవారం యా దగిరిగుట్ట డిపో మేనేజర్ మురళీకృష్ణకు వినతి పత్రాన్ని అందజేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో గ్రామస్తులు గొర్లైన ఐలయ్య, చిమ్మి సత్యనారాయణ, గొడిశెల నర్సింహులు, సిద్దులు, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో రాబోయేది బీఆర్‌ఎస్ ప్రభుత్వమే



యాదగిరిగుట్ట : పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పుతున్న గొంగిడి మహేందర్‌రెడ్డి

యాదగిరిగుట్ట: రాష్ట్రంలో రాబోయేది బీఆర్‌ఎస్ ప్రభుత్వమేనని ఆ పార్టీ రాష్ట్ర రైతు విభాగం ప్రధాన కార్యదర్శి గొంగిడి మహేందర్‌రెడ్డి అన్నారు. తుర్కపల్లి మండలం దయ్యంబండ తండా గ్రామ పరిధిలోని మంచిరోనిమామిళ్ల, బబ్లు తండాకు చెందిన పలువురు కాంగ్రెస్, బీజేపీ నాయకులు బుధవారం యాదగిరిగుట్ట పట్టణంలోని ఆయన నివాసం బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని బొందపెట్టాలని పిలుపునిచ్చారు. బీఆర్‌ఎస్ అభ్యర్థులను గెలిపించుకోవాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో నమ్మకం పోయిందని, మళ్లీ కేసీఆర్‌నే ప్రజలు కోరుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో తుర్కపల్లి మండల అధ్యక్షులు పిన్నపురెడ్డి నరేందర్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ గడ్డమీది రవీందర్‌గౌడ్, రమేష్ యాదవ్, మహేందర్ నాయక్, తాటికొండ రాజు, మాడోత్తు సుమన్, సుధాకర్, సతీష్‌రెడ్డి, తాటికొండ అజిత్, శ్రీనివాస్ నాయక్, అమరేందర్ నాయక్, లక్ష్మీ నాయక్, తిరుపతిరెడ్డి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడిచేయడం దారుణం



భువనగిరిటౌన్ : సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ మాజీ చైర్మన్ బర్రె జహంగీర్

భువనగిరిటౌన్ : సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్ పై దాడి చేయడం దారుణమని పలువురు సామాజిక ప్రజా సంఘాల నాయకులు అన్నారు. బుధవారం భువనగిరి పట్టణంలోని పూలే అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్‌లో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు.కార్యక్రమంలో భానోతు భాస్కర్ నాయక్ , మున్సిపల్ మాజీ చైర్మన్ బర్రె జహంగీర్, దళిత ఐక్యవేదిక అధ్యక్షుడు బట్టు రామచంద్రయ్య, సీనియర్ జర్నలిస్ట్ మల్లారెడ్డి, మాజీ కౌన్సిలర్ ఈరపాక నరసింహ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కొండమడుగు నరసింహ, లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర నాయకుడు ధీరవత్ రాజేష్ నాయక్, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి అన్నంపట్ల కృష్ణ, ఐద్వా రాష్ట్ర నాయకురాలు బట్టుపల్లి అనురాధ, పూలే అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్ నిర్వాహకులు దొడ్డి యాదగిరి, శివలింగం, చెన్నయ్య, శ్రీనివాసాచార్యులు, శంకర్ పాల్గొన్నారు.

రాజ్యాంగంపై దాడిగానే పరిగణించాలని

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్‌పై దాడి చేయడం రాజ్యాంగంపై దాడి చేయడంగానే పరిగణించాలని సీనియర్ జర్నలిస్ట్ మల్లారెడ్డి, సీనియర్ అడ్వకేట్ నాగారం అంజయ్య, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎండీ జహంగీర్ అన్నారు. సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. సమావేశంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు బట్టుపల్లి అనురాధ, బీఎస్పీ రాష్ట్ర నాయకుడు బట్టు రామచంద్రయ్య, కవి, రచయిత చిన్నయ్య, నాయకులు మాటూరి బాలరాజు, కల్లూరి మల్లేశం, దాసరి పాండు, ఎండీ ఇమ్రాన్, సుర్పంగ శివలింగం, భాస్కర్ నాయక్, అమీద్, చంద్రారెడ్డి, మాయ కృష్ణ, గడ్డం వెంకటేష్, పల్లెర్ల అంజయ్య, అన్నంపట్ల కృష్ణ, లావుడియా రాజు, ముత్యాలు పాల్గొన్నారు.

జస్టిస్ గవాయ్‌పై దాడిపై నిరసన

చౌటుప్పల్ : సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్‌పై జరిగిన దాడిని ఖండించాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పల్లె మధుకృష్ణ, గడ్డం వెంకటేష్‌లు అన్నారు. బుధవారం డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో పట్టణ కేంద్రంలో నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఎండీ.ఖయ్యూం, సలీం, సూర్జిత్, ముత్యాలు, రాజశేఖర్‌రెడ్డి, గణేష్, పాల్గొన్నారు.

అడ్డగూడూర్: సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్‌పై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ బుధవారం దళిత సంఘాల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. కార్యక్రజుమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ బాలెంల విద్యాసాగర్, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు రాజు మాదిగ , పరుశురాములు, సురేష్, నరేష్, అయోధ్య రాజు, మల్లయ్య మహేందర్, అరవింద్ పాల్గొన్నారు.

మోత్కూరు : సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై దాడిని ఖండించాలని చేనేత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గుండు వెంకటనర్సు, స్వేరో నెట్ వర్క్ జిల్లా అధ్యక్షుడు ఎర్రవెల్లి నర్సయ్యలు బుధవారం వేర్వేరు ప్రకటనలో ఖండించారు. కేంద్రం అధికారంలో ఉన్న బీజేపీ అనుసరిస్తున్న విధానాలతోనే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని విమర్శించారు. సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి పైనే దాడి జరిగితే సామాన్య ప్రజలకు రక్షణ ఎక్కడ ఉంటుందన్నారు.

అడ్డంకులను అవకాశాలుగా మార్చుకొని ఎదగాలి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న విజ్ఞాన్స్ యూనివర్సిటీ డైరెక్టర్ డాక్టర్ వైవీ దాసేశ్వర్‌రావు

భూదాన్‌పోచంపల్లి : అడ్డంకులను అవకాశాలుగా మార్చుకొని విద్యార్థులు ఉన్నత శిఖరాలకు ఎదగాలని విజ్ఞాన్స్ యూనివర్సిటీ డైరెక్టర్ డాక్టర్ వైవీ దాసేశ్వర్‌రావు అన్నారు. బుధవారం మండలంలోని దేశ్‌ముఖిలోని విజ్ఞాన్స్ యూనివర్సిటీలో ఎంబీఏ మొదటి సంవత్సరం తరగతులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కెరీర్‌లో రాణించడానికి ఆత్మ విశ్వాసం, క్రమశిక్షణ, పట్టుదలను ఆయుధంగా చేసుకోవాలన్నారు. అనంతరం మేనేజ్‌మెంట్ స్టడీస్ హెచ్‌ఓడీ ప్రొఫెసర్ సరిత సత్పతి మాట్లాడుతూ ఎంబీఏ పూర్తి చేసిన విద్యార్థులకు ప్రపంచ వ్యాప్తంగా మంచి ఉద్యోగ అవకాశాలు ఉంటాయన్నారు. అంతకుముందు విద్యార్థులచే నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఆయా విభాగాల డీన్లు, హెచ్‌ఓడీలు, డైరెక్టర్లు, అధ్యాపకులు, తల్లిదండ్రులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న మాదవిలత

భువనగిరి : విద్యార్థులకు చట్టాలపై అవగాహన ఉండాలని జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ప్రధాన కార్యదర్శి మాధవిలత అన్నారు. బుధవారం పట్టణంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. విద్యార్థి దశలోనే మత్తు పదార్థాలతో కలిగే అనార్థాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. బాలలకు కల్పించిన హక్కులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయులు వెంకన్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రోడ్డు బాధితులకు నష్ట పరిహారం చెల్లించాలి



బాధితులతో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట పట్టణం నుంచి పాతగుట్ట వరకు చేపట్టిన రోడ్డు విస్తరణలో ఇళ్లు కోల్పోతున్న బాధితులందరికీ పూర్తి స్థాయి నష్ట పరిహారం చెల్లించాకే రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రచ్చ శ్రీనివాస్, పట్టణ అధ్యక్షులు కర్రె ప్రవీణ్ డిమాండ్ చేశారు. రోడ్డు విస్తరణలో ఇళ్లు కోల్పోతున్న బాధితులను బుధవారం వారు పరామర్శించారు. గతంలో పట్టణంలో రోడ్డు విస్తరణ చేసినప్పుడు ఏ విధంగా పరిహారం చెల్లించారో.. అదే పద్ధతిలో పాతగుట్ట రోడ్డు విస్తరణలో ఇళ్లు కోల్పోతున్న బాధితులకు పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. బాధితులకు ఎలాంటి అన్యాయం జరిగిన ఎమ్మెల్యే ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యులు ఆకుల చంద్రమౌళి, పట్టణ మాజీ అధ్యక్షులు బోనగిరి శ్యాంసుందర్, పట్టణ కార్యదర్శి ఆలేటి కర్ణ, పలుగుల సురేష్, సీనియర్ నాయకులు లెంకలపల్లి శ్రీను, రంగ సత్యం, రాజమణి, భాస్కర్‌రెడ్డి, సుడుగు రాజిరెడ్డి, అశోక్, మల్లేష్‌గౌడ్, రంగా రేఖ, నల్ల వాసుదేవారెడ్డి, సురేష్, అజయ్, బుచ్చిబాబు, ఆకుల దేవేందర్, నాగేందర్, అనిల్, రాపోల్ నవీన్, నంద ప్రవీణ్, వంశి, బోగ అజయ్ పాల్గొన్నారు.

పోచంపల్లిలో భారీ వర్షం

భూదాన్‌పోచంపల్లి : పోచంపల్లిలో బుధవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. సాయంత్రం 6 గంటల నుంచి రెండు గంటల పాటు కుండపోత వర్షం కురవడంతో పట్టణ కేంద్రంలోని ప్రధాన రహదారులన్నీ జలమయంగా మారాయి. దీంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఈ వర్షాలతో చేతికి వచ్చిన పంట నష్టపోయే ప్రమాదం ఉందని రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

సీపీఎం అభ్యర్థులను గెలిపించుకోవాలి

మోటకొండూర్: స్థానిక సంస్థల ఎన్నికల్లో సీపీఎం అభ్యర్థులను గెలిపించుకోవాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు మాటూరి బాలరాజు గౌడ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఆ పార్టీ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బొలగాని జయరాములు, కొల్లూరి అంజనేయులు, కొల్లూరి సుధాకర్, వడ్డెబోయిన మహేందర్, చిన్న బత్తిని రోహన్, చెరుకు అనిల్, కొల్లూరి నాగరాజు, వంగపల్లి సాయిలు, కాంబోజు యాదయ్య, బండెల పోషయ్య, మొగిలిపాక నరసింహ్మ, మామిడాల కనకయ్య పాల్గొన్నారు.

కనులపండువగా విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలు



పూజలు నిర్వహిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

వలిగొండ : మండలంలోని కంచనపల్లి గ్రామపరిధిలోని మాధవనగరంలో నూతనంగా నిర్మించిన శివాలయంలో బుధవారం విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో గుడి నిర్మాణ దాతలు సైరెడ్డి మల్లారెడ్డి సుజాత,మాధవరెడ్డి సులోచన,సత్తిరెడ్డి కవిత, ధ్వజస్తంభం దాత కొంతం యాదిరెడ్డి అనసూయ, సాదు మల్లారెడ్డి,నాయకులు డేగల పాండు, రేసు బుచ్చిరెడ్డి, జక్క జంగారెడ్డి, బద్దం గౌరారెడ్డి, కొమురెల్లి బాలకృష్ణారెడ్డి, వడ్డెబోయిన వెంకటేశం పలువురు ఆలయ కమిటీ సభ్యులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్, అదనపు కలెక్టర్‌ను కలిసిన అధికారులు



కలెక్టర్‌తో వివిధ శాఖల అధికారులు

భువనగిరిటౌన్ : తెలంగాణ తహసీల్దార్ అసోసి యేషన్, తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ , టీజీటీఏ, టీజీఆర్‌ఎస్‌ఏ సంఘాల నాయకులు బుధవారం కలెక్టర్ హనుమంతరావు, అదనపు కలెక్టర్ వీరారెడ్డి, డీఆర్‌ఓ జయమ్మలను కలెక్టర్ కార్యాలయంలో కలిసారు. ఈ సందర్భంగా వారికి దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టీజీ ఆర్ఎస్ అధ్యక్షుడు బాణాల రామిరెడ్డి, రాష్ట్ర మహిళ అధ్యక్షురాలు రాధా, తెలంగాణ తహసీల్దార్ సంఘం అధ్యక్షుడు జిల్లా అధ్యక్షుడు రవికుమార్, కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, ట్రెజరర్ హరికృష్ణ, టీఆర్ ఎస్ఏ అధ్యక్షుడు వెంకటరెడ్డి ,సెక్రటరీ పల్లవి , ఆర్డీవోలు కృష్ణారెడ్డి , శేఖర్ రెడ్డి, ఎస్డీపీ జగన్నాధరావు, తహసీల్దార్లు శ్యాంసుందర్ రెడ్డి ,లాల్ బహదూర్ శాస్త్రి ,హరికృష్ణ, వీరబాయి, జ్యోతి ,నాగదివ్య, అనిత, గణేష్ ,ఆంజనేయులు, దశరథ ,బ్రహ్మయ్య, జల కుమారి, సుధాకర్ రావు, మల్లికార్జున రావు, హరికృష్ణ, లోకేందర్ రెడ్డి, రామారావు, పూర్ణచందర్ , రమేష్ ,నరసింహ, డిప్యూటీ తహసీల్దార్లు కళ్యాణ్, సురేష్ , విజయలక్ష్మి ,సిరాజ్, ప్రణయ్, కలెక్టరేట్ సిబ్బంది, పలువురు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఎండిన చెట్టు తొలగింపు

సాక్షి ఎఫెక్ట్

అడ్డగూడూరు : మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఎండిపోయి ప్రమాదకరంగా ఉన్న చెట్టుపై గత నెల 29న 'విరిగిపడితే ప్రమాదమే' శీర్షికతో సాక్షి దిన పత్రికలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. బుధవారం పాఠశాల అవరణలో గల ఎండిన చెట్టును తొలగించారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు మోత్కూరు విద్యార్థి



శివమణి

మోత్కూరు : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్ -19 విభాగంలో రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు మోత్కూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫస్టియర్ ఎంపీసీ చదువుతున్న ఆత్మకూరు(ఎం) గ్రామానికి చెందిన విద్యార్థి కోరె శివమణి ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రభా జస్టిస్ బుధవారం తెలిపారు. భువనగిరిలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-19 జిల్లా స్థాయి ఎంపికలో అత్యుత్తమ ఆటతీరు కనబర్చి ఎంపికయ్యాడని పేర్కొన్నారు. శివమణిని ఈ సందర్భంగా ప్రిన్సిపాల్‌తోపాటు లెక్చరర్లు అభినందించారు.

చెర్క జగన్నాథంకు నివాళి

వలిగొండ : మండలంలోని గోకారం గ్రామానికి చెందిన సీపీఎం నాయకుడు చెర్క జగన్నాథం వర్ధంతిని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పలువరు సీపీఎం నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన పార్టీకి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు సిర్పంగి స్వామి, మెరుగు వెంకటేశం, కొండే కిష్టయ్య, కొండూరు సత్తయ్య, వేముల లక్ష్మయ్య, గూడూరు బుచ్చిరెడ్డి, ధ్యానబోయిన యాదగిరి, మహేష్, అంజయ్య పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అక్షరాస్యులుగా మార్చాలి

తుర్కపల్లి: వయోజనులను అక్షరాస్యులుగా మార్చాలని ఎంపీడీఓ లెంకల గీతారెడ్డి అన్నారు. బుధవారం నవభారత్ సాక్షరత కార్యక్రమంలో భాగంగా ఎంపీడీఓ కార్యాలయంలో ఉల్లాస్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వయోజన విద్యా ప్రాధాన్యతను గ్రామస్థాయిలో విస్తరించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ మాలతీ, ఏపీఓ రమణ, ఆర్‌పీలు రమేష్, శ్రీలత, శ్రీశైలం పాల్గొన్నారు.

సౌకర్యాలు కల్పించాలని వినతి

చౌటుప్పల్ : సహకార బ్యాంకులో సౌకర్యాలు, వసతులు కల్పించాలని కోరుతూ పలువురు ఖాతాదారులు బుధవారం జిల్లా కేంద్ర సహకార బ్యాంకు సీఈఓ రావులపాటి శంకర్‌రావుకు వినతిపత్రం అందజేశారు. భవనం రెండో అంతస్తులో బ్యాంకు ఉండడంతో ఖాతాదారులు, వృద్ధులు బ్యాంకుకు రావాలంటే ఇబ్బందులు పడుతున్నారన్నారు. బ్యాంకు కార్యాలయాన్ని కిందికి మార్చేందుకు తగు చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో కోరారు.

హద్దులు ఏర్పాటు చేయాలని..

మోత్కూరు : మున్సిపల్ కేంద్రంలోని 456 సర్వే నంబర్‌లో కుంట శిఖం భూమికి సర్వే చేయించి హద్దులు నిర్ణయించాలని కోరుతూ పలువురు నాయకులు బుధవారం కలెక్టర్ హనుమంతరావును కలిసి వినతిపత్రం అందజేశారు. కుంట కబ్జాకు గురవుతుందన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో విద్యార్థుల రాజకీయ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎడ్ల నరేష్, ప్రధాన కార్యదర్శి అన్నెపు భాస్కర్ తదితరులు ఉన్నారు.

ఈ రోడ్డుపై ప్రయాణించేదెలా?

- అర్ధాంతరంగా నిలిచిన మోత్కూరు – రాజన్నగూడెం రోడ్డు విస్తరణ పనులు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు





బురదమయంగా మారిన రాజన్నగూడెం-మోత్కూరు రోడ్డు విస్తరణ పనులు

మోత్కూరు : మోత్కూరు మున్సిపల్ కేంద్రంలోని పాల శీతలీకరణ కేంద్రం చౌరస్తా నుంచి రాజన్నగూడెం వరకు చేపట్టిన రోడ్డు విస్తరణ పనులు అర్ధాంతరంగా నిలిచి పోయాయి. దీంతో రాయగిరి-మోత్కూరు ప్రధాన రహదారిపై నుంచి ఖమ్మం, మహబూబాబాద్, సూర్యాపేట జిల్లాలకు వెళ్లే ప్రయాణికులు, వాహనదారులు నానా ఇబ్బందులు పడుతున్నారు.


రూ.5.80 కోట్లు మంజూరు..

మోత్కూరు – రాజన్నగూడెం రోడ్డు విస్తరణ పనులకు 2021లో అప్పటి ప్రభుత్వం రూ.5.80 కోట్ల నిధులు మంజూరు చేసింది. ఈ పనులు చేపట్టేందుకు సీ 5 కన్‌స్ట్రక్షన్ కంపెనీ టెండర్ దక్కించుకుంది. వివిధ కారణాలతో గత ప్రభుత్వ రోడ్డు విస్తరణ నిర్మాణం పనులను చేపట్ట లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఈ రోడ్డు పనులకు స్థానిక ఎమ్మెల్యే మందుల సామేల్ శంకుస్థాపన చేశారు. రోడ్డు విస్తరణను 7మీటర్ల వెడల్పు నుంచి 10 మీటర్ల వెడల్పుకు పెంచారు. రాజన్నగూడెం నుంచి కిలో మీటర్ వరకే బీటీ రోడ్డు పనులను పూర్తి చేశారు. ఆ తర్వాత పనులు నిలిచిపోయాయి. రాజన్నగూడెం పెట్రోల్ బంక్ నుంచి పనకబండ చౌరస్తా వరకు 2కి.మీ. వరకు మట్టి పనులు పూర్తిచేశారు. బీటీ పనులను చేయాల్సి ఉంది.

మట్టిరోడ్డుతో ఇబ్బందులు..

రాజన్నగూడెం పెట్రోల్ బంక్ నుంచి పనకబండ చౌరస్తా వరకు మట్టి రోడ్డు పనులు మాత్రమే పూర్తి చేసి వదిలేశారు. దీంతో వర్షా కాలంలో మట్టి రోడ్డంతా బురదమయంగా మారుతుండడంతో వాహనదారులు ఈ మార్గంలో ప్రయాణించేందుకు ఇబ్బందు లు పడుతున్నారు. ఈ రోడ్డుపై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడడంతో చిన్నపాటి వర్షం కురిసిన గుంతలు వర్షపు నీటితో నిండి చెరువులను తలపిస్తున్నాయి. రాత్రి వేళల్లో గుంతలు కన్పించక ప్రమాదాలు జరుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు వాహనదారులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేయాలని పలువురు కోరుతున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం



ఆత్మకూరు(ఎం) నుంచి మోత్కూరు, గుండాల, అడ్డగూడూరు ల్యాండ్ సర్వేయర్ పనుల కోసం ద్విచక్ర వాహనంపై వెళ్లి వస్తుంటాను. ఎర్ర మట్టి పోసి అసంపూర్తిగా రోడ్డు పనులు వదిలి వేయడంతో ఇబ్బందులు పడుతున్నాం. వర్షం కురిస్తే బురదమయంగా మారుతుండడంతో ఈ మార్గంలో ప్రయాణించలేక పోతున్నాం.

– బి.బ్రహ్మాచారి, ఆత్మకూరు(ఎం)

త్వరలో పనులు ప్రారంభిస్తాం

రోడ్డు పనుల టెండర్ దక్కించుకున్న సీ 5 కన్‌స్ట్రక్షన్ కంపెనీ అగ్రిమెంట్ పిరియడ్ పూర్తి అయినప్పటికీ రోడ్డు విస్తరణ పనులు సకాలంలో పూర్తి చేయలేదు. దీంతో కాంట్రా క్టర్‌కు ఉన్నతాధికారులు నోటీసులు ఇచ్చి టెండర్ రద్దు చేశారు. విస్తరణ పనులను ఇటీవల మరో కంపెనీకి అప్పగించారు. త్వరలో పనులు ప్రారంభమవుతాయి.

– మెంట స్వామి, ఆర్అండ్‌బీ ఏఈ